క్లుప్తంగా

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆధునీకరణ పనులు



హాస్టల్‌కు ఆధునీకరణ పనులు పూర్తి చేసిన దృశ్యం

దెందులూరు: మండలంలోని కొవ్వలిలోని నియోజకవర్గ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో ఆధునీకరణ పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బీ. రమేష్ అన్నారు. బుధవారం కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను పైన హాస్టల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. పనులు చేస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరింత నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు గోల్డెన్ రాజు, కర్లుడు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

దెందులూరు: ప్రతి ఒక్కరికి సంక్రాంతి అసంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నామని గోపన్నపాలెం పీహెచ్‌సీ డాక్టర్ రాకేష్, డాక్టర్ రోజా అన్నారు. బుధవారం గోపన్నపాలెం వైద్యశాలలో వారు మాట్లాడుతూ ఎంపీహెచ్‌ఓ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి పొలాల వద్ద ప్రజలకు రెండు రకాల వ్యాధుల పట్ల అవగాహన కల్పించి సర్వే చేస్తున్నామన్నారు. ప్రజలందరూ ఈ రెండు రకాల సర్వేకు సహకరించాలని పూర్తి వివరాలు తెలియజేస్తేనే వ్యాధుల నివారణకు శాఖ పరంగా తమ వంతు సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే అవగాహన కార్యక్రమాన్ని వారు పరిశీలించారు.

ఫ్లెక్సీ చించివేతపై ఆగ్రహం



మాజీ సీఎం జగన్ ఫ్లెక్సీని చించివేసిన గుర్తు తెలియని వ్యక్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ముస్లింలకు రంజాన్ మాస ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని చింపివేయడం ఎంతవరకు సమంజసమని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం ప్రకటన విడుదల చేశారు. పెదపాడులో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటుచేయగా గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారని పేర్కొన్నారు. ఎల్లకాలం ఈ ప్రభుత్వమే ఉంటుందని కలల కనవద్దని, పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవని తెలిపారు. పోలీసులు విచారణ జరిపి ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయాలకు చంద్ర గ్రహణం!

- వైభవం కోల్పోతున్న సచివాలయాలు
- గతంతో పోలిస్తే 75శాతం సేవలు కట్
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజానీకం



కొప్పులవారిగూడెంలో స్థానిక నాయకులతో కలసి సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న అబ్బయ్యచౌదరి(ఫైల్)



శ్రీరామవరం సచివాలయం

పెదవేగి : గతంలో గ్రామీణులు ఏ చిన్న పని ఉన్నా వేకువజామునే లేచి మండల కేంద్రానికో...జిల్లా కేంద్రానికో బయలుదేరేందుకు సిద్ధపడాల్సి వచ్చేది. దీంతో ఉదయం పూట చేసుకునే వ్యవసాయ పనులకు ఇబ్బందులు ఎదురయ్యేవి. పైగా సదరు సమస్యపై రోజుల కొలది కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు అయ్యేవికావు. ఇది గ్రహించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం తీసుకురావాలనే బృహత్ సంకల్పంతో పంచాయతీ కేంద్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రైతులు, గ్రామీణులకు సమస్యల పరిష్కార వ్యవస్థను అందుబాటులోకి తెచ్చి, ప్రజలకు 139రకాల సేవలను అందించేవారు. ప్రతి రోజూ గ్రీవెన్స్ ఏర్పాటు చేసి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపేవారు. అలానే రైతులు, గ్రామీణుకు అవసరమైన ధృవీకరణ పత్రాలు సచివాలయాలు ద్వారా పొందేవారు. అలానే సంక్షేమ పథకాలు అందించడలోనూ ఈ వ్యవస్థ క్రీయాశీలకంగా వ్యవహరించింది.

కూటమి పాలనలో సచివాలయాలకు..

వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహర్దశ పొందిన సచివాలయాలకు 2024 ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక చిన్నచూపునకు గురయ్యాయి. ప్రజలకు 139రకాల సేవలను అందించే సచివాలయాల్లో 75శాతం పైగా సేవలను కూటమి ప్రభుత్వం దూరం చేసింది. దీంతో ఏ పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలన్న మీ-సేవా కేంద్రాలకు లబ్ధిదారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు రైతులకు గత ప్రభుత్వం చెల్లిస్తూ వచ్చిన పంట బీమా పథకం ప్రీమియంను తీసివేసింది. దీంతో రైతులే పంటల బీమా ప్రీమియంను చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. పైగా వీటిని నమోదు చేసుకునేందుకు మీ-సేవా కేంద్రాల బాట పట్టాల్సి వస్తోంది. జగన్ ప్రభుత్వం ఇంటికే వచ్చి వలంటీర్లు సంక్షేమ పథకాలకు పేర్లు నమోదు చేసుకొని లబ్ధి చూకూర్చేవారని, కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు ఇబ్బందులకు గురి చేస్తోందని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛన్లకు, రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకుందామని సచివాలయాలకు వెళితే సర్వర్ పనిచేయడం లేదని చెబుతుండటంతో మంలంలోని లబ్ధిదారులు ఏమీ చేయలేని పరిస్థితుల్లో వెనక్కి వెళుతున్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందాయి. ఇందులో ప్రధాన భూమిక పోషించింది. వలంటీర్లే అని చెప్పాలి. ఏ పథకమైన ప్రతి అర్హుడికి అందాలనే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయానికి అనుగుణంగా వలంటీర్లు పని చేశారు. అలానే కరోనా కష్టకాలంలో వీరు చేసిన సేవలు వెలకట్టలేనివి. కాగా గతంలో చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై నోరుపారేసుకున్నప్పటికీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ల వ్యవస్థను కొనసాగించి వారికి గౌరవ వేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక వలంటీర్ల వ్యవస్థ అనేది లేదని, వాటిని కొనసాగించడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదని అసెంబ్లీ సాక్షిగా తన మంత్రుల ద్వారా తెలియజేసి, వంటీర్లను వెన్నుపోటు పొడిచాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు కావొస్తున్న వలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వలంటీర్లు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నప్పటికీ తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం వలంటీర్లను ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలో 28, దెందులూరు మండలంలో 20, పెదపాడు మండలంలో 22, ఏలూరు రూరల్ మండలంలో 11 వెరసి మొత్తం 81 సచివాలయాలను ప్రభుత్వం కేటాయించింది.

సచివాలయాల్లో సేవలు కొనసాగించాలి



సచివాలయాలు లేక ముందు చిన్న సర్టిఫికేట్ కావాలన్న మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లోనే చాలా వరకు ప్రభుత్వ సేవలను అందుకున్నాం. ప్రస్తుతం ఏ చిన్న పని కావాలన్న మరి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాని సచివాలయ సిబ్బంది తెలియజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయాల్లోనే గతంలో అందే సేవలను అందించాలని కోరుతున్నాం.

– మట్టా రాగిణి, ఎంపీటీసీ రాయన్నపాలెం

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో వలంటీర్లను యథావిధిగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.5వేలు నుంచి రూ.10వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు పూర్తయినా ఇంతవరకు వలంటీర్లు గురించి ఎటువంటి హామిని ఇవ్వలేదు. తక్షణమే మాలాంటి వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుకుంటున్నాను.

– కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ

పెదవేగి : ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పెదవేగి మండలం వీరంపాలెంలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు పనిచేస్తున్న ఎర్ర చెరువు వద్ద ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీకి గండి కొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీకి నిధులు తగ్గించి పేదల పొట్ట కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పేదలకు బువ్వ పెట్టిన ఈ చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం పేదలందరి పెన్నై ఉందని తెలిపారు. ఉపాధి హామీలో కూలీలకు పేస్లిప్పు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. కూలీలకు నాలుగు వారాలు నుంచి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. కూలీల యొక్క వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉపాధి హామీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మేట్లకు పారితోషం ఐదు రూపాయలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పనులను మ్యాన్యువల్ పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మార్చి 12న విజయవాడ జరుగుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఈ ధర్నాకు అన్ని గ్రామాల నుంచి ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, పేదలు, దళితులు, గిరిజనులు, మహిళలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన ఆదరగొట్టిన విద్యార్థులు

భీమడోలు: భీమడోలు అమ్మవార్ల జాతర మహోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామ దేవతలుగా పేరొందిన శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల జాతర సంబరాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జాతర ముఖ్య ఘట్టాలు నేపథ్యంలో దాదాపు సాంస్కృతిక కార్యక్రమాలు ముగిసాయి. మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో లోకల్ టాలెంట్ పేరుతో చిన్నారుల సినిమా పాటలు, పలు శాస్త్రీయ, ఫోక్ సాంగ్స్‌కు నృత్యాలు చేసి చూపరులను అలరించారు. దీనితో ఆ ప్రాంతమంతా హర్షధ్వనుల మధ్య నృత్య ప్రదర్శన జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలను తిలకరించారు. జాతర కమిటి అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలి

పెదవేగి : నియోజకవర్గ అభివృద్ధి పనులపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు, పోలవరం ఆర్ఎంసీ, నీటిపారుదల శాఖ, పంచాయితీ రాజ్, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పోలవరం, పెరుగు గూడెం, చల్లచింతలపూడి నుంచి కొక్కిరపాడు వరకు పోలవరం కాలువపై ప్రజల సౌకర్యార్థం నిర్దేశిత ప్రాంతాల్లో ఘాట్ల నిర్మాణం చేపట్టాలని, అందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏలూరు ఇరిగేషన్, ఆర్ఎంసీ, డివిజన్ ఈఈ దేవ ప్రకాష్, సత్రంపాడు, ఏలూరు, భీమడోలు సబ్ డివిజన్లు కి చెందిన ఆర్ఎంసీ డీఈలు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలు



పాతూరులో రైతుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలు: రీసర్వేతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక కాబడిన సూరప్పగూడెం రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరులోని పంట పొలాలకు వెళ్లి అక్కడ మ్యాప్‌లను పరిశీలించారు. డ్రోన్ ద్వారా వచ్చిన సర్వే నెంబర్లు, విస్తీర్ణాలకు సంబంధించిన ఛాయచిత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రీసర్వే అనంతరం మీ పొలాల విస్తీర్ణం, ఖాతాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి పలు ప్రశ్నలు సమాధానాలు రాబట్టారు. రైతుల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత సర్వే శాఖ అధికారులపై ఉందన్నారు. మరో రెండు రోజుల్లో ఈ గ్రామంలో రీసర్వే ప్రక్రియ పూర్తి కావస్తున్నందున, పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని కోరారు. రీసర్వేతో రైతులకు అన్ని విధాలుగా మేలు జరుగుతుందన్నారు. పాతూరులోని ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మిక సందర్శన చేశారు. పాఠశాలలోని వంట గది, కోడి గ్రుడ్లు, చిక్కీల నాణ్యతను పరిశీలించారు. బాలబాలికలతో కొద్ది సేపు ముచ్చటించారు. చిన్నారులతో ఇంగ్లీషు పుస్తకాలు చదివించారు. భవిష్యత్తులో ఏమి అవుతారని వారిని జేసీ అడుగ్గా ఓ విద్యార్థినీ కలెక్టర్ అవుతా, కొందరు డాక్టర్ అవుతా అంటూ సమాధానాలు ఇచ్చారు. చురుగ్గా సమాధానాలు ఇవ్వడంతో హెచ్ఎం పి.నిర్మలకుమారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో అచ్యుత అంబరీష్, సర్వే శాఖ ఏడీ రమణ, డీఐ రమాదేవి, మండల సర్వేయర్ ధర్మారావు, ఏవో ఎస్‌పీవీ ఉషా రాణి, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కొక్కిరపాడులో పొలం పిలుస్తోంది



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పెదపాడు: మండలంలోని వసంతవాడ, కొక్కిరపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ రైతులు తమ ఆధార్‌కు లింకైన ఫోను నంబరుకు వచ్చే ఏటీపీ చెప్పడం ద్వారా రైతు నమోదు పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వానపల్లి ప్రదీప్ కుమార్, పశువైద్యులు డాక్టర్ రమణ, రవి, గ్రామసుథలు వేముల పల్లి చంటిబాబు, కన్నారావు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

పెదపాడు: తనతో సహజీవనం చేస్తున్న వ్యక్తి తన కుమార్తెపై లైంగిక దాడి చేసాడంటూ ఓమహిళ పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పచ్చిగళ్ల పవిత్ర అనే మహిళకు ఇద్దరు ఆడపిల్లలు. ఆమె భర్త నుంచి విడిపోయి 15ఏళ్ల క్రితం వసంతవాడకు చెందిన అరసాడ నాని అనే అవివాహిత వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇదిలా ఉండగా గత రెండేళ్లుగా తన కుమార్తెతో చనువుగా వ్యవహరిస్తున్నట్లు స్థానిక పెద్దలతో చెప్పి మందలించారు. అయినప్పటికీ వినకుండా రెండేళ్లుగా కుమార్తెతో సహజీవనం చేయడంతో కుమార్తెకు తల్లి మధ్య గొడవ జరిగింది. ఈనేపథ్యంలో తల్లి ఫిర్యాదు మేరకు అతనిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. ఈమేరకు పెదవేగి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై వసంతవాడలు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

చలో ఏలూరును విజయవంతం చేయండి

దెందులూరు: అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయాలని, కంపెనీలు సిండికేట్‌గా మారి రైతులను నష్టపరచడాన్ని అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరు మండలంలోని రామారావుగూడెం, చల్ల చింతలపూడి, పెరుగ్గూడెం తదితర గ్రామాల్లో కోకో రైతుల చలో ఏలూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు కోకో రైతుల సమస్యలపై చలో ఏలూరు కలెక్టరేట్ ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల నుంచి కోకో రైతులు ఏలూరు తరలిరావాలని కోరారు. అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.900 ధర ఉన్నా ఆ ప్రకారం రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం కిలో గింజలకు రూ. 500 నుంచి రూ.650 మాత్రమే ధర ఇవ్వడం వలన కోకో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కోకో రైతు సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, బీ.రమేష్ రెడ్డి, కట్టా భాస్కరరావు, కోకో రైతులు పాల్గొన్నారు.

మూసుకుపోతున్న సీతంపేట కాల్వ

దెందులూరు: మండలంలోని సీతంపేట కాలువ పరిధి కుదించుకుపోతుంది. సంబంధిత శాఖ మండల జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం ఇందుకు ప్రధాన కారణం. కాలువ రెండు వైపులా గట్లు వెడల్పు తగ్గటం రెండు వైపులా చెట్లు పెరిగిపోవడం, కర్రనాచు, చెత్తాచెదారం, తూడు విపరీతంగా పెరగటం ఇందుకు నిదర్శనం. ఇన్ని జరిగిన సీతంపేట కాలువవైపు సంబంధిత శాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. వేలాది ఎకరాల సాగు సీతంపేట కాలువపై ప్రత్యేక ఆధారపడి ఉంది. మరింత సమర్థవంతంగా రైతులకు సాగునీరు అందజేసేందుకు అధికారులు సీతంపేట కాలువ ఆధునికరణకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రైస్తవుల దీక్షలు ప్రారంభం



మాలధారులతో రెక్టర్ ఫాదర్ ఐ.మైఖేల్



కెథడ్రల్ చర్చి

40 రోజులు ఆచరించనున్న తపస్సుకాల దీక్షలు

దెందులూరు: ప్రభువు అయిన ఏసుక్రీస్తు ఎడారికి వెళ్లి పడిన 40 రోజుల శ్రమలను అనుసరించి క్రైస్తవులు అనునిత్యం ప్రార్థిస్తూ ఉపవాసం చేస్తూ 40 రోజులు పాటు తపస్సుకాల దీక్షలు చేస్తారు. నేటి నుంచి 40 రోజులు పాటు ఈ దీక్షలను ఏలూరు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని క్రైస్తవ సంఘాలతో కలిపి లక్ష మందికిపైగా దీక్షలు స్వీకరిస్తారు. దేవాలయాలకు దీక్షలు చేపట్టే విశ్వాసులు వెళ్లి ఆలయ ఫాస్టర్లు, పాదర్లచే ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నుదిటన విబూది పెట్టి మెడలో జపమాల దండలను వేస్తారు. 40 రోజులు పాటు విశ్వాసులు తపస్సుకాల దీక్షలు చేపట్టిన వారు ఏమైనా కమ్యూనిటీ హాల్, ఇల్లు అద్దెకు తీసుకుని సామూహికంగా కలిసి దీక్షలు చేస్తారు. విశ్వవ్యాప్తంగా వందల కోట్లల్లో విశ్వాసులు చేపట్టే ఈ తపస్సు కాల దీక్షలు క్రైస్తవుల జీవితాల్లో అతి ముఖ్యమైన ఘట్టం.


దీక్షలకు ఆద్యుడు ఫాదర్ ఐ.మైఖేల్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తపస్సు కాల దీక్షలకు ఆద్యుడు రెవరెండ్‌ఫాదర్ ఐ.మైఖేల్. 1992వ సంవత్సరంలో భీమవరం ఆర్‌సీఎం విచారణ వేంపాడులో అప్పట్లో ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి ములగాడ జాన్ ప్రోత్సాహం, సహాయ సహకారాలతో ఆరుగురితో తపస్సు కాల దీక్షలను ప్రారంభించారు. ములగాడ జాన్ ప్రస్తుత ఏలూరు పీఠాధిపతి డాక్టర్ పొలిమేర జయరావు సహాయ సహకారాలతో అన్ని క్రైస్తవ సంఘాలతో కలిపి లక్షకు పైగా తపస్సు కాల దీక్షలు చేపడుతున్నారు.

ఆచరణ ఇలా

- ఉదయం, సాయంత్రం దేవాలయాలకు వెళ్లి ప్రార్థనలు చేయాలి
- తెలుపు, ముక్కుపొడిరంగు దుస్తులు ధరించాలి
- కాళ్లకు చెప్పులు వేయకూడదు
- నేలపై చాప మీద నిద్రించాలి
- మాంసాహారం, వివాహ జీవితానికి, మద్యానికి దూరంగా ఉండాలి.
- ప్రతి బుధ, శుక్రవారంలో శిలువు మార్గంలో పాల్గొన్నాలని
- వారంలో ఒకరోజు దీక్షలు చేపట్టిన వారి సమూహం వద్ద రాత్రి ప్రార్థన నిర్వహించాలి.
- దీక్ష చేపట్టిన 40 రోజుల్లో ఒక పుణ్య క్షేత్రాన్ని సందర్శించాలి.
- దీక్ష విరమణ సమయంలో కూడా ఒక దేవాలయం వద్ద దీక్షను విరమింపచేయాలి.


ఆధ్యాత్మిక అభివృద్ధి లక్ష్యం కావాలి



దీక్షలను చేపట్టిన విశ్వాసులు ఆధ్యాత్మికాభివృద్ధి లక్ష్యం కావాలి. దేవుని పట్ల విశ్వాసంతో దీక్ష, జీవన విధానం కొనసాగించాలి. ప్రేమ, త్యాగం, సేవాభావాలను కలిగి ఉండాలి. దీక్షా ధారులు ఇతరులకు స్ఫూర్తి కావాలి.

– డాక్టర్ పొలిమేర జయరావు, ఏలూరు పీఠాధిపతి

దీక్షాధారుల పరిధి పెరగాలి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బిషప్ జాన్ ములగాడ ప్రోత్సాహకంతో తాను దీక్షలు ప్రారంభించడం దేవుని ఆశీస్సులుగా కర్తవ్యంగా భావిస్తున్నాను. ఆరుగురితో ప్రారంభించిన తపస్సు కాల దీక్షలు అన్ని సహకారంతో మారిన ఆధ్యాత్మిక జీవన విధానంతో లక్షకుపైగా అన్ని క్రైస్తవ సంఘాలు కలిపి దీక్షలు చేపడుతున్నారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. విశ్వాసుల సంఖ్య, జీవన విధానం మరింత పెరగాలి.

– ఫాదర్ మైఖేల్ రెక్టర్ కెథ్రడల్ అమలోద్భవి చర్చి, ఏలూరు